క్లుప్తంగా

నేడు చలో హైదరాబాద్

అచ్చంపేట రూరల్: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 5న నిర్వహించే చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లేష్ కోరారు. బుధవారం పట్టణంలో ఎంపీడీఓ మధుసూదన్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కార్మికులు వేమయ్య, శ్రీను, మల్లేష్, విష్ణు, రాజశేఖర్ పాల్గొన్నారు.

ముమ్మరంగా ఇంటి పన్నుల వసూలు

తాడూరు: మండల కేంద్రంలో గ్రామ పంచాయతీలకు చెల్లించే ఇంటి పన్నుల బిల్లు ముమ్మరం చేశారు. బుధవారం పంచాయతీ కార్యదర్శి పవన్‌కుమార్ ఆధ్వర్యంలో ఇంటింటా తిరిగి పన్నులను వసూలు చేశారు. పన్ను చెల్లించిన వారికి రశీదు అందజేశారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థికసాయం

వెల్దండ: మండలంలోని కుప్పగండ్ల గ్రామానికి చెందిన గోరటి మల్లేష్ మృతి చెందాడు. బుధవారం పెద్దాపూర్ ఉన్నత పాఠశాల 2001 ఎస్ఎస్‌సీ బ్యాచ్‌కి చెందిన స్నేహితులు మృతుని కుటుంబానికి రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. అదేవిధంగా రాచూర్ గ్రామానికి చెందిన దుబ్బ రామస్వామి అనారోగ్యంతో మృతి చెందగా వార్డు సభ్యుడు పడకంటి వెంకటేష్ రూ.3 వేలు, బీఆర్‌ఎస్ నాయకులు శ్రీనివాస్ రూ.5వేలు ఆర్థికసాయం అందజేశారు.

రూ.1.20 లక్షల విరాళం

వెల్దండ: మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న బీరప్ప దేవాలయ నిర్మాణానికి సింగిల్‌విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్యగౌడ్ బుధవారం ఆలయ కమిటీ సభ్యులకు రూ.1.20 లక్షల నగదు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవాలయ అభివృద్ధికి ప్రతి ఒక్కరు ముందుకు వచ్చి ఆర్థికసాయం అందించాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చంద్రమోహన్‌రెడ్డి, పుల్లయ్య, ఎర్రశ్రీనుముదిరాజ్, కురుమసంఘం అధ్యక్షులు వెంకటయ్య, జంగయ్య, రామకృష్ణ, భీరయ్య, కృష్ణ, భాస్కర్, జంగయ్య తదితరులు ఉన్నారు.

దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహిద్దాం

కల్వకుర్తిరూరల్: దేవీ నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకుందామని వాసవీ దేవాలయం చైర్మన్ జూలూరి రమేష్‌బాబు అన్నారు. బుధవారం పట్టణంలోని వాసవీకన్యకాపరమేశ్వరి దేవాలయంలో ఆయన నవరాత్రి ఉత్సవాల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ నెల 15 నుంచి ఉత్సవాలు ప్రారంభమవుతాయని 25న ఉత్సవాలు ముగుస్తాయన్నారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు అశోక్, కార్యదర్శి రఘు, రాము, కోటేశ్వర్, కలిమిచర్ల రమేష్, శ్రీధర్, శ్రీనివాస్, ప్రవీణ్, కృష్ణయ్య, విజయభాస్కర్, శ్రీనివాస్ తదితరులతోపాటు పలువురు ఉన్నారు.

ముదిరాజుల అభ్యున్నతే లక్ష్యం

తెలకపల్లి: ముదిరాజుల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యమని సర్పంచ్ భాస్కర్‌గౌడ్ అన్నారు. బుధవారం మండలంలోని తాళ్లపల్లిలోని చెరువులో చేపపిల్లలను ఆయన వదిలారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ మత్స్యకారులు సంక్షేమం కోసం 7వ విడతలో భాగంగా ప్రభుత్వం ఉచితంగా చేపపిల్లలను పంపిణీ చేసిందన్నారు. కార్యక్రమంలో మత్స్యపారిశ్రామిక సహకార సంఘం అధ్యక్ష, కార్యదర్శులు గజ్జెలయ్య, శంకరయ్య, ఆంజనేయులు, రాములు, శివ, నిరంజన్, దశరథం, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏఈపై సభ్యుల ఆగ్రహం

పెద్దకొత్తపల్లి: వివిధ గ్రామాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్‌లు సత్యం, చిన్నయ్య, వెంకటేశ్వర్‌రెడ్డిలు మాట్లాడుతూ విద్యుత్ ఏఈ ప్రదీప్‌గౌడ్‌కు ఎన్నిసార్లు ఫోన్ చేసిన ఎత్తడం లేదని వాపోయారు. మండలంలో రెండో విడత గొర్రెల పంపిణీలో సక్రమంగా చేపట్టలేదని సభ్యులు సభ దృష్టికి తెచ్చారు. గ్రామాల్లో నెలకొన్న తాగునీరు, పారిశుద్ధ్య, విద్య సమస్యలను లేవనెత్తారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి అధికారులు పాటుపడాలని సూచించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి మధు, వైస్ ఎంపీపీ దీపికలక్ష్మణ్‌రావు, ఎంపీడీఓ కృష్ణయ్య, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

'గెలిచే సీటును పార్టీ కోల్పోవద్దు'

కల్వకుర్తి: ఇతర పార్టీల నుంచి వచ్చిన నేతలకు పార్టీ టికెట్ ఇచ్చి గెలిచే సీటును కోల్పోవద్దని కాంగ్రెస్ నాయకుడు సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరయ్యారు. పార్టీ బలోపేతానికి, ప్రజల అభిమానం చూరగొన్న రాఘవేందర్ రెడ్డికి పార్టీ టికెట్ కేటాయించాలని కార్యకర్తలు నినాదాలు చేశారు. అనంతరం రాఘవేందర్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ టికెట్ ఇవ్వకపోతే భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తానని పేర్కొన్నారు. సమావేశంలో మండలంలోని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వెల్దండలో చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్



ఊర్కొండలో స్పోర్ట్స్ కిట్స్ అందజేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



తాడూరులో చీరలు అందజేస్తున్న ఎంపీపీ

పేదల సంక్షేమమే ధ్యేయం

- బతుకమ్మ చీరలు, స్పోర్ట్స్ కిట్ల పంపిణీ



కొల్లాపూర్‌లో మహిళలకు బతుకమ్మ చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి

కొల్లాపూర్: పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణ, ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఎమ్మెల్యే మహిళలకు బతుకమ్మ చీరలు పంపిణీ చేశారు. గ్రామ పంచాయతీలకు, యువకులకు క్రీడా సామగ్రిని అందజేశారు. ఆర్డీఓ నాగరాజు, ఎంపీడీఓ చెన్నమ్మ, తహసీల్దార్ శ్రీకాంత్, మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, ఎంపీపీ బోజ్యానాయక్, గొర్రెల కాపరుల సంఘ జిల్లా అధ్యక్షుడు గాలియాదవ్, నాయకులు ఉన్నారు.

వెల్దండ: మండల కేంద్రంలోని రైతువేదికలో బతుకమ్మ చీరలు, క్రీడా సామగ్రి, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులనను ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోనే తెలంగాణ సంక్షేమ పథకాలు ఆదర్శంగా నిలిచాయన్నారు. సర్పంచ్ భూపతిరెడ్డి, ఎంపీపీ విజయ, వైస్‌ఎంపీపీ శాంతి, మార్కెట్ డైరెక్టర్ జయప్రకాష్, తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ శ్రీనివాసులు, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, పార్టీ కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

ఊర్కొండ: మండల కేంద్రంలోని రైతువేదిక ప్రాంగణంలో బతుకమ్మ చీరలు, స్పోర్ట్స్ కిట్లు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను జడ్చర్ల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పంపిణీ చేశారు. మండలంలో గ్రామ పంచాయతీలకు 16 స్పోర్ట్స్ కిట్లు, 28 కల్యాణలక్ష్మి, ఇద్దరికి షాదీముబారక్ చెక్కులు అందజేశారు. ఆడపడుచులకు బతుకమ్మ చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీచైర్మన్ శాంతకుమారి, ఎంపీపీ రాధ, వైఎస్ ఎంపీపీ అరుణ్ కుమార్, తహసీల్దార్ చెన్న కిష్టన్న, ఎంపీడీఓ ప్రభాకర్, నాయకులు, యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

తెలకపల్లి: మండలంలోని గౌరెడ్డిపల్లి గ్రామంలో ఎంపీపీ కొమ్ము మధు, తహసీల్దార్ మురళీమోహన్ బతుకమ్మ చీరల పంపిణీ చేశారు. ఎంపీఓ వెంకటయ్య, ఏపీఎం నిరంజన్, ఆర్ఐ శ్రీనివాస్‌రావు, సర్పంచ్ వెంకట్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి అనిత, ఉప సర్పంచ్ కృష్ణయ్య, మహిళలు పాల్గొన్నారు.

చారకొండ: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ జయసుధ మండలంలోని గ్రామాల పంచాయతీ కార్యదర్శులకు, డీలర్లకు బతుకమ్మ చీరలు, క్రీడా కిట్లు అందజేశారు.

బిజినేపల్లి: తిమ్మాపేటలో బతుకమ్మ చీరలు, స్పోర్ట్స్ కిట్లను ఎంపీడీవో కరుణశ్రీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఇబ్రహీం, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కవిత, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

కోడేరు: మండలంలోని పస్పులలో సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు రఘువర్ధన్‌రెడ్డి బుధవారం బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు పాల్గొన్నారు.

తాడూరు: మండలంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో బుధవారం లబ్ధిదారులకు బతుకమ్మ చీరలతోపాటు కేసీఆర్ క్రీడా కిట్లను ఎంపీపీ శ్రీదేవి, సీఈఓ ఉష పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు బతుకమ్మ చీరలు, యువకులు క్రీడాసామగ్రిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైస్ ఎంపీపీ శివలీల, ఎంపీడీఓ గంగామోహన్, ఎంపీఓ లక్ష్మణ్‌నాయక్, సర్పంచ్‌లు రాజేందర్‌రెడ్డి, రమణ, కార్యదర్శులు పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ



అచ్చంపేట రూరల్: పట్టణ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని మున్సిపల్ చైర్మన్ ఎడ్ల నర్సింహగౌడ్ అన్నారు. బుధవారం పట్టణంలోని పలు వార్డులలో చేపడుతున్న అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు రాజేశ్వర్‌రెడ్డి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

టీఎస్‌పీఎస్సీ బోర్డును రద్దు చేయాలి

కల్వకుర్తిరూరల్: గ్రూప్–1 అభ్యర్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న టీఎస్‌పీఎస్సీ బోర్డును రద్దు చేసి ప్రక్షాళన చేయాలని విద్యావంతుల వేదిక నాయకుడు రాజేందర్ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని బీఆర్‌ఏ అంబేడ్కర్ చౌరస్తా నుంచి ఆర్‌డీఓ కార్యాలయం వరకు నిరుద్యోగులు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రూప్‌- 1 పరీక్ష రాసిన అభ్యర్థులకు ప్రభుత్వం రూ.లక్ష చెల్లించాలన్నారు. అనంతరం ఆర్‌డీఓ శ్రీనుకు వినతిపత్రం అందజేశారు. సదానందంగౌడ్, సత్యం, విజయ్‌కుమార్‌రెడ్డి, నర్సింహ, మల్లయ్య పాల్గొన్నారు.

కోడేరులో కొనసాగించాలి

పెద్దకొత్తపల్లి: ముతిరెడ్డిపల్లి గ్రామాన్ని కొత్తగా ఏర్పాటు చేసిన ఏదుల మండలంలో కాకుండా కోడేరు మండలంలోనే కొనసాగించాలని కోరుతూ బుధవారం మండల కేంద్రంలో గ్రామస్తులు రోడ్డుపై ధర్నా నిర్వహించారు. ఘటన స్థలానికి కొల్లాపూర్ సీఐ యాలాద్రి చేరుకొని ఆందోళనకారులను శాంతింపజేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకరావు బీమేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

కంప్యూటర్ ఆపరేటర్ల సమ్మె

కందనూలు: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లు చేపట్టిన సమ్మె బుధవారం నాటికి ఆరోరోజుకు చేరుకుంది. జిల్లా కేంద్రంలో సమ్మె శిబిరంలో ఆపరేటర్ల సంఘం అధ్యక్షుడు హసన్ మాట్లాడుతూ ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

బంగారు భవిష్యత్‌కు ఉపాధ్యాయులే కీలకం

బిజినేపల్లి: ప్రతి విద్యార్థి భవిష్యత్‌కు ఉపాధ్యాయులే కీలకమని ఎంఈవో భాస్కర్‌రెడ్డి అన్నారు. పాలెం ఆర్‌ఎస్‌సీ ప్రాథమిక పాఠశాలలో జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం భాస్కర్‌రెడ్డికి ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. 14 పాఠశాలల ఉపాధ్యాయులు హాజరై ఆయనను ఘనంగా సన్మానించారు. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు వెంకటేశ్వర్లు, జహంగీర్, నిరంజన్, శ్రీనివాస్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, గాల్‌రెడ్డి, బాలస్వామి, చంద్రమౌళి, రేణుక, మహేశ్వరీ, చంద్రశేఖర్, పరమేష్, శేఖర్, రామకృష్ణ, శ్రీనివాసులు, భాష, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన కల్పించాలి



అచ్చంపేట రూరల్: ఎయిడ్స్ కేసులు ఎక్కువగా ఉన్న ఏరియాలో అవగాహన సదస్సులు నిర్వహించాలని ఎయిడ్స్ స్టేట్ ప్రోగ్రాం నోడల్ ఆఫీసర్, ఇన్‌చార్జ్ డిప్యూటీ డైరెక్టర్ నర్సింహారెడ్డి ఆదేశించారు. సంపూర్ణ సురక్ష కార్యక్రమంలో భాగంగా బుధవారం అచ్చంపేటలోని ఏరియా ఆస్పత్రిలో ఐ సీటీసీ కేంద్రాన్ని పరిశీలించారు. టెస్టుల వివరాలు, పాజిటివ్ కేసుల వివరాల రికార్డులను తనిఖీ చేశారు. జిల్లా ప్రోగ్రాం అధికారి శ్రీశైలం, ఉప మలేరియాధికారి అశోక్‌ప్రసాద్, శ్రీను, అనురాధ పాల్గొన్నారు.

విద్యార్థి ఎంపిక

కొల్లాపూర్ రూరల్: మండలంలోని కుడికిల్ల గ్రామానికి చెందిన ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థి ఎస్ చందు ఉమ్మడి జిల్లా ఖోఖో పోటీలకు ఎంపికయ్యారు. అండర్–14 ఖోఖో బాలుర విభాగంలో ఎంపికైనట్లు హెచ్‌ఎం రమణ తెలిపారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరు

పెద్దకొత్తపల్లి: మండలానికి విద్యాశాఖ మంత్రి ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరు చేస్తూ జీఓ జారీ చేశారని కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరంహర్షవర్ధన్ రెడ్డి తెలిపారు. బుధవారం మారేడుమాందిన్నెలో బీఆర్‌ఎస్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సునీతశ్రీకృష్ణ, వార్డు సభ్యులు మహేష్ తన అనుచరులతో కలిసి మంత్రి నిరంజన్‌రెడ్డి, కొల్లాపూర్ ఎమ్మెల్యే సమక్షంలో 150 మంది బీఆర్‌ఎస్‌లో చేరారు. గ్రామానికి 80 విద్యుత్ స్తంభాలు, ఇళ్లు లేని వారికి ఇళ్లు మంజూరు చేయాలని సర్పంచ్ సునీత ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ కొండల్‌రావు, శ్రీహరిరావు, శ్రీకృష్ణ, గణేష్‌రావు, నాగరాజు, వెంకటయ్య, నర్సింహ, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేశానికి దశ దిశ చూపింది కాంగ్రెస్

మన్ననూర్: దేశానికి స్వాతంత్రం తీసుకువచ్చింది, ప్రజలకు దశ దిశకు కారణమైంది కాంగ్రెస్ పార్టీ అని అమ్రాబాద్ జెడ్పీటీసీ డాక్టర్ అనురాధ అన్నారు. అమ్రాబాద్ మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. అనంతరం స్థానిక మాజీ వైస్ ఎంపీపీ సంబు శోభ నివాసంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. దేశ, రాష్ట్ర భవిష్యత్‌ను దృష్టిల ఉంచుకొని ప్రాజెక్టులు, రోడ్లు, భవనాలు బృహత్ ప్రణాళికలకు రూపకల్పన చేసింది కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. 10 ఏళ్ల బీఆర్‌ఎస్ పాలనలో ఎన్ని ప్రాజెక్టులు కట్టారో బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. సమావేశంలో వైస్ ఎంపీపీ ప్రణీత, ఎంపీటీసీ బాలమ్మ, మాజీ ఉప సర్పంచ్ సుజాత పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

తాడూరు: కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని కాంగ్రెస్ నాయకుడు కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి అన్నారు. బుధవారం గడపగడపకు కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని యాదిరెడ్డిపల్లిలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన కాంగ్రెస్‌ను రాష్ట్ర ప్రజలు ఆదరిస్తున్నారన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగురువేస్తామన్నారు. ఆరు గ్యారంటీ పథకాలపై ప్రచారం నిర్వహించారు.

మండలాల వారీగా ఓటరు జాబితా

నాగర్‌కర్నూల్: జిల్లా వ్యాప్తంగా శాసనసభ ఎన్నికలకు సంబంధించి తుది ఓటరు జాబితాను బుధవారం అధికారులు విడుదల చేశారు ఆయా మండలంలోని గ్రామాల వారీగా ఓటర్ల వివరాలను పొందుపరిచారు.

నాగర్‌కర్నూల్ నియోజకవర్గ ఓటర్ల వివరాలు

మండలం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
తిమ్మాజిపేట	15,820	16051	01	31,872
బిజినేపల్లి	28,898	28444	00	57,342
నాగర్‌కర్నూల్	32,165	32294	01	64,460
తెలకపల్లి	21,480	21,034	00	42,514
తాడూరు	14294	14,148	01	28,443
మొత్తం	1,12,657	1,11,971	03	2,24,631
కొల్లాపూర్ నియోజకవర్గం				
కొల్లాపూర్	23,341	22,506	0	45847
కోడేరు	17,202	16,345	0	33,547
పెంట్లవెల్లి	8,718	8,357	0	17,075
పెద్దకొత్తపల్లి	23,792	23,056	3	46,851
చిన్నంబావి	12,003	11,817	0	23,820
వీపనగండ్ల	11,470	11,044	0	22,514
పాన్‌గల్	20,449	19,295	1	39,745
మొత్తం	1,16,975	1,12,420	4	2,29,399

అచ్చంపేట నియోజకవర్గ ఓటర్ల వివరాలు

మండలం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
చారకొండ	6,240	5,934	1	12,175
వంగూరు	15,782	15,932	0	31,714
ఉప్పునుంతల	14,272	14,525	0	28,797
అచ్చంపేట	27,828	27,741	1	55,570
బల్మూర	16,983	16,502	0	33,485
లింగాల	14,450	14,464	0	28,914
అమ్రాబాద్	13,428	13,637	0	27,065
పదర	8,141	7,704	0	15,845
మొత్తం	1,17,124	1,16,439	2	2,33,565
కల్వకుర్తి నియోజకవర్గం				
కడ్తాల్	16576	15443	0	32019
తలకొండపల్లి	18016	17259	2	35277
కల్వకుర్తి రూరల్	15074	14672	0	29746
కల్వకుర్తి అర్బన్	11902	11864	0	23766
వెల్దండ	15978	15586	1	31565
చారకొండ	3394	3363	0	6757
ఆమనగల్	15065	14876	0	29941
మాడ్గుల	21388	20187	4	41579
మొత్తం	117393	113250	7	230650

కలెక్టరేట్ ఎదుట ధర్నా



నాగర్‌కర్నూల్‌రూరల్: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం మధ్యాహ్న భోజన కార్మికులు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్ శ్రీనివాసులు మాట్లాడారు. జీఓ నెంబర్ 8 ప్రకారం వేతనాలు ఇవ్వాలని, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ కోశాధికారి అశోక్, నాయకులు అనురాధ, శివలీల, మహేశ్వరి, బాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్ల నిరసన

తాడూరు: మండల కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్లు బుధవారం అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సుజాత, అలివేల, లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పునుంతల: కొన్ని రోజులుగా చేస్తున్న సమ్మెలో భాగంగా బుధవారం చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని చేపట్టారు. దీంతో అంగన్‌వాడీ టీచర్లను ముందస్తుగా పోలీసులు అదుపుచేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

తెలకపల్లి: చలో హైదరాబాద్ కార్యక్రమానికి మండల కేంద్రం నుంచి అంగన్‌వాడీ టీచర్లు తరలివెళ్లారు.

ఆశావర్కర్ల భిక్షాటన



సాక్షి, నెట్‌వర్క్: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆశావర్కర్లు చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారం కొనసాగింది. అచ్చంపేట, లింగాల, బిజినేపల్లి, చారకొండలో ఆశావర్కర్లు భిక్షాటన చేసి వినూత్నంగా నిరసన తెలిపారు. తెలకపల్లిలో సమ్మె శిబిరంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

తండాల అభివృద్ధికి ప్రాధాన్యం

బిజినేపల్లి: తండాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి అన్నారు. బుధవారం పదేళ్ల ప్రజా ప్రస్థానం మర్రన్న యాత్రలో భాగంగా అనేఖాన్‌పల్లి తండా, వెల్గొండ గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మర్రి జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ తండాలను గ్రామపంచాయతీలుగా చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ జక్కా రఘునందన్ రెడ్డి, బంగ్ల నాగిరెడ్డి, రామ్‌లక్ష్మణ్, సూర్యశేఖర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, రాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గులాబీ గెలుపును ఎవరూ అడ్డుకోలేరు

కల్వకుర్తిరూరల్: రాబోయే శాసనసభ ఎన్నికల్లో గులాబీ గెలుపును అడ్డుకోవడం ఎవరితరం కాదని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ ధీమా వ్యక్తం చేశారు. బుధవారం మండలంలోని తర్నికల్‌లో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన 100 మంది ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మూడోసారి సీఎంగా కేసీఆర్ బాధ్యతలు స్వీకరిస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు విజయ్‌గౌడ్, వైస్ ఎంపీపీ గోవర్ధన్, తర్నికల్ రైతు సమన్వయ అధ్యక్షుడు సురేష్‌గౌడ్, మనోహర్‌రెడ్డి, మాణిక్యారావు, వెంకటేష్ తదితరులతోపాటు పలువురు పాల్గొన్నారు.

ట్రాక్టర్, బైక్ ఢీకొని వ్యక్తికి గాయాలు

ఉప్పునుంతల: మండల కేంద్రానికి సమీపంలో జప్తీసదగోడు వైపు వెళ్లే రహదారిలో బుధవారం ఎదురెదురుగా వెళ్తున్న ఇసుక ట్రాక్టర్, బైక్ ఢీకొన్నారు. ఈ ఘటనలో బైక్‌పై ఉన్న వంగూరు మండలం కోనాపూర్‌కు చెందిన యువకుడు రాజశేఖర్ తలకు, కాళ్లకు గాయాలయ్యాయి. స్థానికులు బాధితుడిని చికిత్స నిమిత్తం అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఖోఖోలో విద్యార్థుల ప్రతిభ

కందనూలు: వనపర్తి జిల్లాలోని ఘనపూర్‌లో 67వ ఎస్‌జీఎఫ్ ఉమ్మడి జిల్లా అండర్ 17 విభాగంలో నిర్వహించిన ఖోఖో టోర్నమెంట్‌లో బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా బాలికలు ప్రతిభ కనపర్చి మొదటి బహుమతి సాధించారు. ఈ మేరకు డీఈఓ గోవిందరాజులు విద్యార్థులను అభినందించారు. ద్వితీయ స్థానంలో బాలుర జట్టు నిలిచింది. కార్యక్రమంలో జిల్లా ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ పాండు, కోఆర్డినేటర్ కృష్ణ, ప్రసాద్ గౌడ్, నిరంజన్ యాదవ్ తదితరులు విద్యార్థులను అభినందించారు.

మృతదేహం లభ్యం

నాగర్‌కర్నూల్ క్రైం: పశువులకు నీటిని తాగించేందుకు వెళ్లి చెరువులో పడి గల్లంతైన వ్యక్తి మృతదేహం బుధవారం లభ్యమైనట్లు ఎస్ఐ మహేందర్ తెలిపారు. ఎస్ఐ వివరాల ప్రకారం శ్రీపురం గ్రామానికి చెందిన కుంటి వెంకటయ్య (50) మంగళవారం రాత్రి పశువులకు నీటిని తాగించేందుకు గ్రామంలోని చెరువు వద్దకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు నీటిలో మునిగాడు. ఫైర్ సిబ్బంది చెరువులో గాలించగా మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనరల్ ఆస్పత్రి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తపాలా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



లింగాల: తపాలా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం గ్రామీణ ప్రాంతాలలోని బ్రాంచ్ పోస్టాఫీసులలో పని చేసే జీడీఎస్ ఉద్యోగులు ఒక రోజు సమ్మె నిర్వహించారు. మండలంలోని ఆయా బ్రాంచ్‌లకు చెందిన జీడీఎస్ ఉద్యోగులు మండల కేంద్రంలోని సబ్ పోస్టాఫీసు ఎదుట సమ్మెలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డివిజన్ అసిస్టెంట్ సెక్రెటరీ బాలాజీ మాట్లాడుతూ కేంద్రం ప్రభుత్వం జీడీఎస్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలన్నారు. జీడీఎస్ ఉద్యోగులు ప్రశాంత్, శివప్రసాద్, కొండయ్య, తరుణ్, జయరాం, తిరుపతిగౌడు, ప్రవీణ్‌కుమార్, అక్రమ్, రాఘవేందర్, శంకర్, షకీల్, మనీషా, మమత పాల్గొన్నారు.

తెలకపల్లి: జీడీఎస్ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన ఒక రోజు సమ్మెలో భాగంగా మండల కేంద్రమైన తపాలా కార్యాలయం ఎదుట తపాలా ఉద్యోగులు విధులు బహిష్కరించి సమ్మె చేపట్టారు. ఏఐజీడీఎస్‌యూ తెలంగాణ సర్కిల్ ఉపాధ్యక్షుడు జి శంకరయ్య బీపీఎం రాములు, రమాదేవి, వెంకటమ్మ, మౌనిక, అనిత, నసీబ్‌బేగం, మల్లేష్, శివకుమార్, శ్రీకాంత్, మనోహర్, బాల్‌చెన్నయ్య, కృష్ణయ్య, శ్రీధర్ పాల్గొన్నారు.

ఎర్రమన్ను గుట్ట మాయం

సాక్షి, నాగర్‌కర్నూల్: జిల్లా కేంద్రానికి సమీపంలోని తూడుకుర్తి శివారులోని ఎర్రమన్ను గుట్టను అక్రమంగా ధ్వంసం చేస్తూ.. రూ.కోట్లు కూడగట్టుకుంటున్నారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దిలీపాచారి ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. ఎల్వీ ప్రసాద్ ఆస్పత్రికి ఆనుకుని సుమారు 200 ఎకరాల్లోని గుట్టను మట్టి కోసం విచ్చలవిడిగా ధ్వంసం చేస్తున్నారని మండిపడ్డారు. నిత్యం జేసీబీలు, టిప్పర్లతో జిల్లా కేంద్రానికి టన్నుల కొద్దీ మట్టి తరలుతోందని చెప్పారు. ఈ దందాలో ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డితో పాటు ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డికి సంబంధాలున్నాయని ఆరోపించారు. స్థానిక ఎంపీపీ నర్సింహారెడ్డి ఇరువురి మధ్య సంధానకర్తగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. నాగర్‌కర్నూల్ సీఈఓగా చెప్పుకొనే మర్రి జనార్దన్‌రెడ్డి నియోజకవర్గంలోని చెరువులు, గుట్టలపై పడటమే పనిగా పెట్టుకున్నారని చెప్పారు. మంగళవారం అతివేగంతో నిర్లక్ష్యంగా వెళ్తున్న మట్టి టిప్పర్ ఢీకొని తూడుకుర్తికి చెందిన మహిళ బొగ్గుల చంద్రమ్మ మృతిచెందిందన్నారు. బాధ్యులపై కేసులు పెట్టకుండా పోలీసులే పంచాయతీ నిర్వహిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికే గ్రామంలోని కొంగరోనిగుట్టను మాయం చేశారని దుయ్యబట్టారు. కలెక్టర్ స్పందించి అక్రమ మట్టిదందాకు అడ్డుకట్ట వేసి తూడుకుర్తిలోని ఎర్రమన్ను గుట్టను సంరక్షించాలని చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు సుధాకర్‌రెడ్డి, చారి, శ్రీశైలం పాల్గొన్నారు.